# ఆనందమయ (సాహితీ) సభలు

బరంపురంలో సాహితీ సభల్లో పాల్గొనడానికి ఈనెల 19వ తేదీ సాయంకాలం నేనూ, వాకాటి పాండురంగారావుగారూ, గరిమెళ్ళ వెంకటసీతారాంగారూ వాల్తేరు స్టేషన్లో ఒక రైలెక్కాం. విజయ నగరంలో డాక్టర్ అక్కిరాజు రమాపతిరావు, శీలా వీర్రాజుగారు, నిష్ఠల వెంకట్రావుగారు, రావి-ఎన్.- అవధానిగారు, బులుసు-జీ-ప్రకాష్‌గారు అదే రైలెక్కారు. చీపురుపల్లిలో దేవరాజు రవిగారు ఆ బండికే వచ్చారు.

తిలారు స్టేషన్ దాటాక ఇంజన్ సమీపంలోని ఒక బోగికి నిప్పంటుకుంది. బండి ఆగలేదు. కోటబొమ్మాళి వరకూ వెళ్ళి అక్కడాగింది. అగ్నిని మాపే కార్యక్రమం, కొంత కాలిన ఆ బోగీని అక్కడ దిగ్గొట్టేసే కార్యక్రమం (గంటన్నర) అయ్యాక మళ్ళీ బండి బైలుదేరింది. ఉదయం నాలుగున్నరకి వెళ్ళవలసింది, ఆరింటికి చేరుతుందని సరదాగా జోకేసుకుని సర్దుకుని కూర్చున్నాం.

బారువ స్టేషన్‌లో ఆగిన ఆ రైలు; ఇంకేదో త్రూ-ట్రెయిన్ కిచ్చిన సిగ్నల్ తనకే ననుకుని, బెల్ లేకుండా బయలుదేరింది. కాని, కొద్దిదూరం వెళ్ళేలోగానే (పాయింటు మార్పులేక) పట్టాలు తప్పింది. ఇంజను, దాని వెంటనే వున్న ఫస్టుక్లాసు బోగీ వొరిగిపోయాయి. లైను యాభై అరవై గజాల మేరకు ధ్వంసం అయింది. వేగం పుంజుకుని వుంటే రైలు మొత్తం బోల్తా పడవలసింది.

ఆ విధంగా రెండు ప్రమాదాలు గడచి బరంపురం చేరాం వుదయం ఏడింటికి.

ఈ కథంతా విన్న సంకు పాపారావుగారు "బతికించారు బాబూ,

పదిమందీ ప్రసంగాలు చెయ్యవలసిన మహాసభలు మౌనంతో ప్రారంభ మయ్యే ఆపద తప్పింది" అన్నారు.

*                    *                    *

రామమోహన్‌రాయ్‌గారూ, నేనూ ఆ సభలకి రిపోర్టర్సుగా వెళ్ళాం. సభల్లో రెండో సెషన్‌లోనే! అస్తమానూ "సామాజిక స్పృహ" అంటూ వినబడుతోంది. ఇన్నిమాట్లు సామాజిక స్పృహ అంటూ రాసుకోలేకపోతున్నానండీ అని రాయ్‌గారు స్పృహతప్పి పోయిన వాడిలా కుర్చీలో వెనక్కి వాలేరు.

"ఫరవాలేదు లెండి. సామాజిక స్పృహ తప్పడంకన్నా, స్పృహ తప్పడం మంచిదే" అని నేను అనేసరికి ఠంగున లేచి కూర్చున్నారు రాయ్‌గారు.

*                    *                    *

సభా ప్రారంభంలో ప్రార్థన వుంటుంది. ఎవరో ఘంటసాలలా పాడుదామని ప్రయత్నంచేస్తూ "అనేకదంతం-భక్తానాం-ఏకదంతం-ముపాస్మహే" అని పాడుతారేమో అని భయపడ్డాను. అనేకదంతం కాదు- అనేకదం; తాం భక్తానాం: మరియు 'ముపాస్మహే' కాదు; ఏక దంతమ్- ఉపాస్మహే- అని పాడాలి. ఘంటసాల రికార్డువల్ల ఎందరో ప్రార్థనా గాయకులు గోతుల్లో పడిపోతున్నారు. అని కాసేపు రాయ్‌గారూ నేనూ విచారించాం.

"దేశమును ప్రేమించుమన్నా" అంటూ కొత్త ట్యూన్‌లో-గురజాడ అప్పారావుగారు తెలుగువాడై పోడంవల్ల జాతీయగీతం కాగల అవకాశాన్ని పోగొట్టుకున్న దేశభక్తి గీతం- చక్కటి రూపం. స్వచ్ఛమైన ఉచ్చారణ కల ఆరుగురు యువకుల పాటతో తెరలేచింది.

ఎంతో రిలీఫ్ అనుభవించాం.

*                    *                    *

"మొదటిరోజు మధ్యాహ్నం కవి సమ్మేళనం. అందరూ తమ తమ 'ప్రక్రియల్ని' కార్యనిర్వాహక సభ్యులకి అందజేయాలి" అని మైక్‌లో చెప్పారు.

"ప్రక్రియలంటే స్వీయ రచనలా? చెప్పండి; మీరు తెలుగు లెక్చరర్ కదా" అని రాయ్‌గార్ని అడిగాను.

"ఔను. ఆపాటి తెలీదా? మీరూ తెలుగెమ్మే వెలిగించారుగా?" అని రాయ్‌గారు నా మీదికి వొరిగారు.

"అర్థం దేహి" అని డబ్బుకు జాపినట్టు చెయ్యి జాపాను.

"రచయిత అన్నవాడికి క్రియ ఏదైనా ప్ర-క్రియ- అంటే మొదటి కర్తవ్యం రచన కదా. అందుచేత ప్రక్రియ- అంటే స్వీయ రచన అని గ్రహించాలి. ఆర్య వ్యవహారంబులు యథారీతి గ్రాహ్యం బులు."

"ఆర్య- ఏమిటి మళ్ళాను?"

"ఏముంది- ఇది ఒరియా దేశం. ఒరియా అన్నమాట "ఆర్య"కి ఈ భాష ప్రకారం సరైన ఉచ్చారణ!"

* * *

"కథకి ముగింపు స్పష్టంగా చెప్పాలా, సూచించి వది లెయ్యాలా?" అని ఎవరో రాచకొండ విశ్వనాథశాస్త్రిగారిని అడగ్గా.

"వివరంగానే చెప్పండి. లేకపోతే సగంమంది అర్థంచేసుకోరు; సగంమంది అపార్థం చేసుకొంటారు" అని జవాబు.

(రాయ్‌గారు ఉదహరించిన ఉదంతం)

* * *

కవి సమ్మేళనంలో ఇస్మాయిల్‌గారు "అనంతపురంలో గాడిదలు" అన్న కవిత చదువుతున్నారు.

ఆ సమయంలో విశ్వనాథశాస్త్రిగారు నా ప్రక్కనే కూర్చున్నారు. "కామెంట్, సార్" అన్నట్టు ఆయన కళ్ళలోకి చూశాను.

"ఏముంది? కవిత్వం ప్రచారానికి పనికి రాకపోయినా కౌంటర్ ప్రచారానికి బాగా పనికొస్తుంది."

* * *

ఒక గోష్ఠికి అధ్యక్షత వహించిన శ్రీశ్రీగారు కవిత్వంలో అన్నిరకాలూ చేరుస్తున్నారుగాని సినిమా కవిత్వాన్ని చేర్చడం లేదని విచారం వెలిబుచ్చారు.

"చేర్చాలంటారా?" అని వాకాటి పాండురంగారావుగార్ని అడిగాను.

"చేర్చాలి. ఎందుకంటే మామూలు కవితలు వ్యక్తి కృషి; సినిమా కవిత సమిష్టి కృషి. వ్యక్తికృషికంటె సమిష్టి కృషికి సామ్యవాదంలో స్థానం హెచ్చు."

* * *

"కవిత్వంలో అవాస్తవిక ధోరణులు" అనే విషయంపై మాట్లాడుతూ జ్వాలాముఖిగారు: "కవి, కవిత్వానికి శ్రద్ధ చూపాలి గాని శబ్ద- మయసభలో పల్టీలు కొట్టకూడదు."

* * *

బరంపురం సభలలో ఎక్కువసార్లు కోట్ చేయబడ్డ వాక్యం కృష్ణశాస్త్రిగారిది. "నవ్వి పోదురుగాక, నాకేటి సిగ్గు; నా ఇచ్ఛయే గాని, నాకేటి వెరపు."

ఎక్కువమంది ఊతపదం "గందరగోళాలు."

* * *

శ్రీకాకుళం యువభారతికి చెందిన శ్రీ బి. పి. శాస్త్రి, స్వీయ కవితా పఠన కార్యక్రమంలో మహాకవి శ్రీశ్రీని మళ్ళీ లేచి, విజృంభించి మాకు మార్గం చూపమంటూ మిక్కిలి హృద్యమైన పద్యంతో అభ్యర్థించారు.

దానికి వాకాటి వారి జవాబు "కవికి ముసలితనం వచ్చినా రాకపోయినా, కవితా ప్రతీకలకు జరామరణాలు లున్నాయి. శ్రీశ్రీని దారి చూపించమనడం ఆయనకి గౌరవమే కాని మనకి దౌర్భాగ్యం."

(28-1-79)